క్లుప్తంగా

గీతా పారాయణం



వేణుగోపాలస్వామి ఆశ్రమంలో భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ: అవదూత వెంకటసుబ్బారెడ్డి స్వామి 21వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక వేణుగోపాల స్వామి ఆశ్రమంలో భగవద్గీత పారాయణం గావించారు. అనంతరం భక్తులు అవదూత స్వామి, వేణుగోపాల స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు అన్నదానం చేశారు.

తగ్గిన మొక్కజొన్న దిగుబడి



క్రిష్టిపాడులో ఆరబోసిన మొక్కజొన్నను చూపుతున్న రైతు

దొర్నిపాడు: వర్షాలు పత్తి, మిరప,మొక్కజొన్న, మినుము పంటలను దెబ్బతీశాయి. ముఖ్యంగా మొక్కజొన్న పంట సాగుచేసినప్పటి నుంచి కోతదశ వరకు వర్షాలు విరామం లేకుండా కురవడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. ఎకరానికి 30 క్వింటాళ్లు రావాల్సిన దిగుబడులు ఏకంగా 20 క్వింటాళ్లకు పడిపోయాయి. ధర కూడా మార్కెట్లో క్వింటాకు రూ. 2,500 వరకు ఉంది. కానీ వర్షానికి గింజల్లో తేమశాతం అధికంగా ఉందని, దళారులు మాత్రం రూ.1,900లకు అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. రెక్కల కష్టం వర్షార్పణం అయ్యిందని ఆందోళన చెందుతున్నారు.

ఆశాజనకంగా కంది



హరివరం వద్ద ఏపుగా పెరిగిన కంది పంట

ఉయ్యాలవాడ: మండల వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 805 హెక్టార్లలో కంది పంట సాగైంది. పంట పూత దశలో ఆశాజనకంగా ఉంది. గత ఏడాది కందిలో ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడం, మార్కెట్‌లో క్వింటా రూ. 9,500 నుంచి గరిష్ఠంగా రూ. 10,500 వరకు ధర లభించింది. ఈ ఏడాది హరివరం, ఉయ్యాలవాడ, ఇంజేడు, ఆర్.పాంపల్లె, బోడెమ్మనూరు, కొండుపల్లె తదితర గ్రామాల్లో అధిక విస్తీర్ణంలో కంది సాగైంది. గత నెల తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షం కందికి ఊరటనిచ్చింది. పైరుకు వాతావరణం కూడా అనుకూలంగా మారడంతో కంది దిగుబడులపై రైతులు ఆశలు పెట్టుకున్నారు.

పార్కుల అభివృద్ధికి కృషి



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న అధికారులు

నంద్యాల(న్యూటౌన్) : పట్టణంలో పార్కుల అభివృద్ధికి అందరి సమన్వయంతో కృషిచేస్తామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం పద్మావతినగర్‌లో పార్కును పరిశీలించారు. పార్కులో పెరిగిన పిచ్చిమొక్కలను సిబ్బంది తొలగించారు. కమిషనర్ మాట్లాడుతూ వారంలో ఒక పార్కును సందర్శించి అక్కడి వసతులు తెలుసుకొని చేపట్టాల్సిన అభివృద్ధి పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపల్ ఎంఈ గుర్రప్ప, డీఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈ రవూఫ్, మురళీధర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాలధారులకు దుస్తులు అందజేత



దుస్తులు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన డాక్టర్ భార్గవర్ధన్‌రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరి దంపతులు పేద భవానీ దీక్ష మాలధారులకు దుస్తులనుబుధవారం అందజేశారు. సమరసత సేవ సంస్థ సభ్యుడు చింతలపల్లి వాసు మాట్లాడుతూ ఆరుగురు దీక్షదారులకు పూజా సామగ్రి, దుస్తులను ఉచితంగా అందజేశారని తెలిపారు. కార్తీక మాసం మొదలైనప్పటి నుంచి దాదాపుగా 50 మంది మాలధారులకు పూజా సామగ్రి, దుస్తులను అందజేశారని చెప్పారు.

సాక్షిగణపతికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతికి పంచామృతాలు, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలా వీరభద్ర స్వామివారికి అభిషేక పూజలు చేశారు.

ఎన్నికల ఏర్పాట్లు షురూ

- 21 నుంచి 23వ తేదీ వరకు సాగునీటి సంఘాలకు ఎన్నికలు
- ఇప్పటికే ప్రారంభమైన ఓటర్ల నమోదు
- 6–10వ తేదీ వరకు ఓటరు జాబితా ప్రదర్శన
- 13వ తేదీన అభ్యంతరాల పరిష్కారం



కేసీ కెనాల్



మాట్లాడుతున్న ఇరిగేషన్ ఈఈ రఘురామిరెడ్డి

నంద్యాల(రూరల్): సాగునీటి సంఘాలకు నిర్వహించే ఎన్నికల నిర్వహణ పనుల్లో అధికారులు వేగం పెంచారు. నంద్యాల జిల్లాలో కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, చిన్ననీటి వనరులు, తెలుగుగంగ ప్రాజెక్టులకు సంబంధించిన ఆయకట్టు 6,12,000 ఎకరాలకు గానూ 307 నీటి సంఘాలు ఉన్నాయి. వీటికి ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ముహూర్తం ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఆయా సాగునీటి ప్రాజెక్టులు, కాలువల కింద నీటిని వినియోగించుకునే రైతులు ఓటర్లుగా ఉంటూ.. కమిటీని ఎన్నుకోనున్నారు. జిల్లాలో ఈ నెల 21వ తేదీన ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశామని ఇరిగేషన్ ఈఈ రఘురామిరెడ్డి బుధవారం తెలిపారు.

ప్రారంభమైన ఓటర్ల నమోదు...

సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు బుధవారం నుంచి ఓటర్ల జాబితా తయారీ కార్యక్రమం ప్రారంభమైంది. భూ యాజమానుల పేర్లు, వివరాలు సేకరించి, జాబితా రూపొందించడంలో అధికారులు బిజీ అయ్యారు. 10వ తేదీ వరకు సేకరించిన వివరాలపై అభ్యంతరాల స్వీకరణ, తుది జాబితా ప్రకటన, అనంతరం ఎన్నికలు నిర్వహిస్తారు. సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూషన్ కమిటీలు, మేజర్ ప్రాజెక్టు కమిటీ ఎన్నికల పోలింగ్ వేర్వేరు తేదీల్లో నిర్వహించనున్నారు. ఎన్నికైన కమిటీలు కాలువల నిర్వహణ, నీటి వినియోగం, తూము, గుర్రపు డెక్క తొలగింపు వంటి పనులు చేపడుతాయి.

ఎన్నికల ప్రక్రియ ఇలా..

- ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు భూ యాజమానుల ఓటరు జాబితా తయారీ
- 11 నుంచి 12వ తేదీ వరకు భూ యాజమానుల ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ
- 13వ తేదీన ఓటరు జాబితా అభ్యంతరాల పరిష్కారం
- 21 నుంచి 23వ తేదీ వరకు ప్రాదేశిక నియోజకవర్గాలు, నీటి యాజమాన్య సంఘాలకు ఎన్నికల నిర్వహణ
- 24 నుంచి 26వ తేదీ వరకు డిస్ట్రిబ్యూటరీ కమిటీ పోలింగ్
- 27 నుంచి 29వ తేదీ వరకు ప్రాజెక్టు కమిటీల పోలింగ్

కూటమి నాయకుల సిఫారసుల కోసం ఆశావాహులు..

సాగునీటి ఎన్నికల్లో ఉన్నతమైన పదవులు దక్కించుకునేందుకు కూటమి నేతలు కొందరు ఆశావాహులు జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల సిఫారసుల కోసం వారి కార్యాలయాల చుట్టు తిరుగుతూ విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది. అధికారులు మాత్రం ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా సాఫీగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని మరోవైపు చేపుతుడంటం విశేషం. కూటమి నాయకుల కుయుక్తులు గెలుస్తాయో.. అధికారుల మాటాలు నెగ్గుతాయో.. ఈ నెల చివరి వరకు వేచి చూడాల్సిందే.

రబీ పంటలకు బీమా చేయించాలి



బిల్లలాపురం వద్ద వరి పొలంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న ఏఓ

నంద్యాల(అర్బన్): రబీలో సాగుచేసిన పంటలకు బీమా పథకం అమలు చేస్తామని ఏఓ ప్రసాదరావు తెలిపారు. ప్రతి రైతు ఈ–పంట, ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని బిల్లలాపురం, కొత్తపల్లె గ్రామాల్లో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గింజకట్టే దశలో ఉన్న వరి పైరును అగ్గితెగులు, మానిపండు తెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు ఒకలీటరు నీటికి, కార్బండిజమ్ ఒకగ్రాము లీటరు నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది శివనాయక్, చక్రి, అనూష పాల్గొన్నారు.

వరి సాగులో మెలకువలు పాటించాలి

గోస్పాడు: వరి పంట సాగులో రైతులు సరైన మెలకువలు పాటించాలని వ్యవసాయాదికారి స్వప్నికా రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వరి సాగులో మోతాదుకు మించిన ఎరువు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించాలన్నారు. రబీ పంటల బీమా ప్రీమియం గురించి రైతులకు అవగాహన కల్పించారు.

యువత ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నంద్యాల(న్యూటౌన్) : 18 ఏళ్లు నిడిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడం ప్రజాస్వామ్యంలో ప్రాథమిక కర్తవ్యమని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వివేకానంద ఆడిటోరియంలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో యువతకు ఓటు హక్కుపై అవగాహన సదస్సు నిర్వహించారు. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన జిల్లా నోడల్ ఆఫీసర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఓటుహక్కు ఎంతో విలువైందన్నారు. నిర్లక్ష్యం వహించకుండా ప్రతిపౌరుడు ఓటుహక్కుకు నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా ఏఎస్ఓ ప్రహ్లాద మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి విద్యార్థి ఓటుహక్కుకు నమోదు చేసుకోవడం ప్రాథమిక హక్కుగా భావించాలన్నారు. జనవరి 2025 తుదిజాబితా వెలువడుతుందని, ఓటరు జాబితాలో పేరు ఉందో లేదో పరిశీలించుకోవచ్చని చెప్పారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శేఖర్, ప్రిన్సిపాల్ సుబ్బయ్య, కోఆర్డినేటర్లు రేవతి, బాలు, ఉశేన్‌బాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం



వరిపైరును పరిశీలిస్తున్న దృశ్యం

గోస్పాడు: ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసే పంటలతో రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని ఏపీసీఎన్ఎఫ్ మాస్టర్ ట్రైనర్ రామాంజిరెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో బుధవారం మహిళా రైతు సుజాత సాగుచేసిన పంట పొలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జీవవైవిధ్యమైన పంటలతో ఆదాయం సమకూరుతుందని, సాగు సమయంలో గట్లవెంట ఇతర రకాల కింద పూల రకాలతో పాటు మిరప, పసుపు, టమాట వంటి వాటిని నాటుకోవడం వల్ల అదనపు ఆదాయం వస్తుందన్నారు.. రైతులు ఆదాయంతో పాటు ఆ కుటుంబానికి సరిపడా పంటలను గట్ల వెంట నాటుకొని ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని చెప్పారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో పండించిన వరి పంటతో పాటు గట్ల వెంట పసుపు, మిరప, టమాట, బంతిపూలు పైర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. సిబ్బంది రాముడు, బాల మద్దిలేటి రైతులు పాల్గొన్నారు

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు విజయనగరం జిల్లాలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 49వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక భువన విజయం కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. వసతి దీవెన, విద్యాదీవెన అందించాలని కోరారు. అనంతరం విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల గోడపత్రికను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేష్, హరిస్వామి, తరుణ్ పాల్గొన్నారు.

బోరు రగడ

- గ్రామ పంచాయతీ, టీడీపీ నాయకుని మధ్య వివాదం
- ఏంపీడీఓ విచారణ



వివాదంగా మారిన బోరు



విచారణ చేస్తున్న ఏంపీడీఓ

శిరివెళ్ల: యర్రగుంట్ల మేజర్ పంచాయతీలో తాగునీటి బోరు విషయంపై గ్రామ పంచాయతీ, టీడీపీ నాయకుని మధ్య రగడ జరుగుతోంది. బోరు తమదేనంటూ పంచాయతీ పాలకవర్గం అంటుంటే, కాదు బోరుపై తనకు హక్కు ఉందంటూ టీడీపీ నాయకుడు వాదిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్లితే.. యర్రగుంట్లలో పేదల ఇళ్ల స్థలాల కోసం 2008లో అప్పటి ఎమ్మెల్యే గంగుల ప్రతాప్‌రెడ్డి 473/2లో 92 సెంట్లు, 479/1లో 28 సెంట్లు, 480/1లో 1.80 ఎకరాలను కలిపి 3 ఎకరాలను ఓ రైతు నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. అనేక కారణాలతో ఆ పొలంలో స్థలాల పంపిణీ జరగక నిరుపయోగంగా మారిపోయింది. స్థలాల కోసం సేకరించిన 3 ఎకరాల్లో 479/1 సర్వే నంబర్‌లో బోరు కూడా ఉంది. కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పొలంలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారు. పేదలు ఇళ్లు నిర్మించుకుని నివాసాలు ఉంటున్నారు. బోరు ఆధారంగా గత ఏడాడి పంచాయతీ అధికారులు యల్లమ్మపేటలోని 2, 3 వార్డుల్లో నివాసం ఉంటున్న 75 కుటుంబాలకు తాగునీటి కోసం పైప్‌లైన్ వేసి నీరు అందిస్తున్నారు. అయితే 2 నెలల క్రితం టీడీపీ నాయకుడు బోరు తనదేనంటూ అగ్రిమెంట్ చూపిస్తూ బోరును స్వాధీనం చేసుకున్నాడు. దీంతో వార్డు ప్రజలకు తాగునీటి సమస్య ఏర్పడింది. ఫిర్యాదులు రావడంతో సర్పంచ్ అయ్యలూరు సుభహార్, ఉప సర్పంచ్ సత్తార్ ప్రతాప్‌రెడ్డి ఈ విషయాన్ని ఎంపీడీఓ శివమల్లేరప్ప, తహసీల్దార్ పుష్పకుమారికి ఫిర్యాదు చేశారు. అధికారులు ఆ నాయకున్ని పిలిపించి విచారణ చేశారు. అగ్రిమెంట్, డాక్యుమెంట్‌లను పరిశీలించారు.

ఎంపీడీఓ విచారణ

ఎంపీడీఓ శివమల్లేరప్ప బోరు ప్రదేశాన్ని పరిశీలించారు. గతంలో ఏ రైతు నుంచి ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వం భూమి కొనుగోలు చేసింది. ఆయా సర్వే నంబర్లలో ఎంత పొలం ఉంది? ఏ సర్వే నంబర్‌లో బోరు ఉంది అనేదానిపై సమగ్ర విచారణ చేశారు. ఆయన మాట్లాడుతూ.. 2008లో ప్రభుత్వం సేకరించిన 3 ఎకరాల్లో 479/1 సర్వే నంబర్‌లోని 28 సెంట్లలో బోరు ఉందన్నారు. దానిపై రెవెన్యూ అధికారులతో విచారణ చేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి

నంద్యాల (న్యూటౌన్): పట్టణంలోని నరసింహయ్య భవనంలో ఈ నెల 9వ తేదీన జరుగనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు బాలవెంకట్ కోరారు.బుధవారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో మండల మూడో మహాసభలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మూడు సంవత్సరాల కాలంలో జరిగిన పోరాటాలపై చర్చించి, భవిష్యత్తులో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై చర్చ ఉంటుందని చెప్పారు. సభలకు సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగరాజు హాజరవుతున్నారన్నారు. మండల కమిటీ సభ్యులు కృష్ణ సంజీవ రాయుడు యూసఫ్ పాల్గొన్నారు.

జిల్లాల్లోనే శిక్షణ ఇవ్వాలి

గోస్పాడు: ఉపాధ్యాయుల శిక్షణ అన్ని జిల్లాల్లో నిర్వహించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు విజయరావు కోరారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇస్తున్న శిక్షణ రెసిడెన్షియల్ పద్ధతిలో కాకుండా నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఇవ్వాలని, బుధవారం అగిరిపల్లిలో జరిగిన శిక్షణలో ప్రధానోపాధ్యాయుడు మృతి చెందడం బాధాకమన్నారు. నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణను మూడు రోజులకు కుదించి ప్రతి జిల్లాలో శిక్షణ ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు భూములను రక్షించాలి

నంద్యాల(న్యూటౌన్): వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించాలని ఇన్సాఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబాఫక్రుద్దీన్ కోరారు. బుధవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయం వద్ద ఆలిండియా తంజీమ్ ఇన్సాఫ్ 11వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జెండాను సీపీఐ సీనియర్ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఇన్సాఫ్ సీనియర్ నాయకులు రియాజ్, రాష్ట్ర సమితి సభ్యులు జిలానీబాషా, జిల్లా నాయకులు మజీద్‌మియా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఆస్తుల ఆదాయం వల్ల మైనార్టీలకు విద్యా, ఉపాధి కోసం ఉపయోగించబడుతుందని, వాటిని కూడా బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రజానాట్య మండలి నాయకుడు గోకారి, ఇన్సాఫ్ నాయకులు రషీద్, మాబు, సూర్యబాబు, బాషా, రఫీ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేయడం సరికాదు

చాగలమర్రి: రాష్ట్ర ప్రభుత్వం 6 రోజులుగా లీడర్‌షిప్ ట్రైనింగ్ పేరుతో ఉపాధ్యాయులను ఒత్తిడికి గురిచేస్తోందని పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బి.రవీంద్రారెడ్డి ఆరోపించారు. తీవ్ర మానసిక ఒత్తిడి కారణంగానే పశ్చిమ గోదావరి జిల్లా ఉండి మండలం ఉండూరు పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట రత్న కుమార్ అరిగిపల్లిలో గుండెపోటుతో మృతి చెందారని తెలిపారు. ప్రభుత్వం లీడర్‌షిప్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నంద్యాల, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులకు హిందూపురం సమీపంలోని బుక్కరాయసముద్రం గ్రామంలో రెసిడెన్షియల్ శిక్షణా నిర్వహించడంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.

ప్రమాదం తొలగింది..



నాడు: ముళ్లపొదల్లో ట్రాన్స్‌ఫార్మర్



నేడు: ముళ్లపొదలు తొలగించిన తర్వాత ఇలా

సాక్షి ఎఫెక్ట్

దొర్నిపాడు: ముళ్లపొదల చాటున దాగున్న ట్రాన్స్‌ఫార్మర్‌ను అధికారులు ఎట్టకేలకు కనిపించేలా చేశారు. ఈనెల 4న సాక్షిలో ప్రచురితం అయిన ‘కనుక్కోండి చూద్దాం’అనే శీర్షికతో కథనం వచ్చింది. దీనిపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. కోవెలకుంట్ల విద్యుత్‌శాఖ ఏఈ రామ్మోహన్ ఆదేశాల మేరకు జేఎల్‌ఎం సుబ్బయ్య ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, అల్లుకున్న తీగలను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే



డి.వనిపెంట పంచాయతీ చెంచుగూడెంలో సర్వే చేస్తున్న కార్యదర్శి

చాగలమర్రి: చెంచుల సంక్షేమం కోసం కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు చేపట్టిన సమగ్ర సర్వే బుధవారం మండలంలోని డి.వనిపెంట పంచాయతీ మజరా గ్రామమైన చెంచుగూడెంలో జరిగింది. పంచాయతీ కార్యదర్శి ముల్లా ఫైరోజా, సచివాలయ సిబ్బంది నిర్వహిస్తున్నారు. చెంచులకు మౌలిక సదుపాయాల కల్పన, రెవెన్యూ పరమైన సమస్యలను పరిష్కరించి వారి సంక్షేమానికి కావాల్సిన అన్ని రకాల వసతులను కల్పించేందుకు సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాయమాల్పూరం గ్రామసభకు 67 దరఖాస్తులు



గ్రామ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రెవెన్యూ గ్రామసభల్లో భాగంగా బుధవారం మండలంలోని రాయమాల్పూరం గ్రామంలో నిర్వహించిన గ్రామసభకు 67 దరఖాస్తులు వచ్చాయని డిప్యూటీ తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సభల్లో భూసమస్యలను పరిష్కరించు కోవచ్చన్నారు. అంతకుముందు పులిమద్ది గ్రామానికి చెందిన రైతు పురుషోత్తమ రెడ్డి తన పొలాన్ని ఆక్రమించుకున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. తనభూమి తనకు ఇప్పించాలంటూ గత కొన్నేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీపీ ప్రభాకర్, సర్వేయర్ సహదేవుడు,కాశన్న పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మద్దూరులో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న ఏఓ

చాగలమర్రి: పంటల్లో సమగ్ర సస్యరక్షణ చేపడితే తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ రంగసేతాజి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం గోట్లూరు, మద్దూరు గ్రామాలకు చెందిన రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. శనగ, జొన్న పంటలను పరిశీలించారు. సాగులో చేపట్టాల్సిన జాగ్రత్తలు, సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. తెగుళ్ల నివారణకు పురుగు మందులపై ఆధారపడకుండా ట్రైకోడెర్మ విరిడితో విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ప్రస్తుత రబీ కాలంలో శనగ, వరి, మినుము, వేరుశనగ, ఉల్లి, జొన్న పంటలకు బీమా చేయడానికి రైతులు తమ వాటాగా ప్రీమియం చెల్లించి బీమా నమోదు చేసుకోవాలని తెలిపారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి



ఎస్ఎంపీ-2 పరీక్షలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

దొర్నిపాడు: విద్యార్థుల అపార్ నమోదు వివరాలను వేగవంతం చేయాలని డిప్యూటీ డీఈఓ మహమ్మద్‌బేగ్ ఎంఈఓలు మనోహర్‌రెడ్డి, రామచంద్రయ్యకు సూచించారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అపార్ నమోదులో ఎదురవుతున్న లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. ఆధార్, అడిషన్లలో విద్యార్థుల వివరాలు చాలా వ్యత్యాసంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం ఎస్ఎంపీ–2 పరీక్షలను పరిశీలించి మార్కులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించాలన్నారు. పాఠశాలలో తాగునీరు, వసతులపై హెచ్‌ఎం శ్రీనివాసరావుతో ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

దొర్నిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలబాలికలు బేస్‌బాల్, రోప్‌స్కిప్పింగ్ క్రీడల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఈనెల 5న నంద్యాలలో ఎస్‌జీఎఫ్ క్రీడలు జరిగాయన్నారు. బేస్‌బాల్ అండర్–17 విభాగంలో మహమ్మద్‌హుసేన్, ఉషారాణి, అండర్–14 విభాగంలో జుబేదా, గురురామాంజనేయ, లోహిత, రోప్‌స్కిప్పింగ్ అండర్–17 విభాగంలో మున్నా ప్రతిభ చూపారు. ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు గుంటూరు, తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ దేవేంద్ర, విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు జయలక్ష్మి, మౌలాలి, రమణయ్య, రవిప్రకాశ్, నరసింహా, ఉసేన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సభ్యులు

చాగలమర్రి: మండల కేంద్రంలోని శ్రీవాసవీ డిగ్రీ కళాశాల 43వ వార్షికోత్సవాన్ని బుధవారం వాసవీ విద్యా సమాజం పాలకవర్గం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గౌరవ అధ్యక్షుడు మురికి వేణుగోపాల్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు క్రిష్ణం శివప్రసాద్ బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ షేక్ షాబుద్దీన్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో డిగ్రీ, జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు రఘురామ్, ఆర్ఎస్ రమణ, సభ్యులు పుల్లారెడ్డి, నరసింహా, చాణిక్య తదితరులు పాల్గొన్నారు.